




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 144 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 29 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE 144 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 29 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

### పరిశ్రమలకు భూ కేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం



- పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అదనపు నిధులు మంజూరు
- విశాఖలో ఏఐజీ ఆసుపత్రి ఏర్పాటుకు 9 ఎకరాల భూమి కేటాయింపు
- టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల కోసం రూ.4,450 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ
- అమరావతిలో వీధిపోటు ప్లాట్ల స్థానంలో వేరేవి ఇచ్చేందుకు రైతులకు అవకాశం
- అంతర్జాతీయ అథ్లెట్ జ్యోతి యర్రాజీకి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పేదలకు గృహ నిర్మాణం

మిగతా2లో

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

- రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉందని జగన్ విమర్శ
- మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య
- సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ
- మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతానన్న జగన్

మిగతా2లో





## మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



### ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు

### ఎన్నికల ప్రచారానికివెళ్తుండగా ఘటన

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

ముంబై: పెన్ పవర్‌మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మిగతా2లో



## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

### అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర నేత అజిత్ పవార్ దుర్మరణం
- ఇది కేవలం ప్రమాదమేనని, కుట్ర కాదని శరద్ పవార్ స్పష్టీకరణ
- సమర్థుడైన నాయకుడిని కోల్పోయామంటూ భావోద్వేగం
- ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

మిగతా2లో



## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

- భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం.. అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించానన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్

మిగతా2లో



## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా

మిగతా2లో

## జనసేన కాదు.. కామసేన

### ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

- జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం
- ఇది జనసేన కాదు, కామాంధుల సేన అంటూ తీవ్ర విమర్శలు
- నగరిలో వైసీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన
- పవన్, చంద్రబాబు, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు

మిగతా2లో

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

### ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల



- వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల
- పూర్తి కాని ప్రాజెక్టును ఎన్నికల ముందు జాతికి అంకితం చేశారని ఆరోపణ
- టన్నెళ్లు, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి
- రూ.900 కోట్ల నిర్వాసితుల ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని విమర్శ
- 2026 నాటికి వెలిగొండను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టీకరణ

మిగతా2లో



## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు రైలు కనెక్టివిటీపై ప్రధానంగా చర్చ
- రాయలసీమ నుంచి కోస్తాకు మెరుగైన రైలు మార్గాలపై దృష్టి
- హై స్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు ప్రతిపాదనపై సమావేశంలో సమీక్ష
- విజయవాడ, విశాఖ వంటి జంక్షన్లలో రద్దీ తగ్గించడంపై చర్చ

మిగతా2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు




పెన్ పవర్ డెస్క్:ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది.

మిగతా2లో




## అజరామరాలు వేటూరి గీతాలు

వేటూరి జయంతి తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిధ్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. తొమ్మిది వేలకు పైగా అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రికకు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మొదటిసారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 – మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా ద్రైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్యకాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. గానగంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

- మొదటి పేజి తరువాయి

వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశం అనంతరం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**పోలవరం పూర్తికి అదనపు నిధులు**

వచ్చే ఏడాది మార్చి–ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయిని సేకరించేందుకు రూ. 247 కోట్లు, లెఫ్ట్ సైడ్ కనెక్టివిటీలో నావిగేషన్ టన్నెల్ నిర్మాణం కోసం రూ. 4.49 కోట్ల అదనపు బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్యామ్ నిర్మాణానికి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, గతంలో తవ్విన రాళ్లలో 50% మాత్రమే నాణ్యంగా ఉన్నాయని, అందువల్ల హిల్ నెం. 902 నుంచి కొత్తగా రాయిని వెలికితీయడానికి ఈ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ (మేఘా)కు అప్పగించారు.

**గృహ నిర్మాణం, అమరావతిపై కీలక నిర్ణయాలు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కోసం హడ్కో నుంచి రూ. 4,450 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని కేబినెట్ రాటిఫై చేసింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం జూన్ నాటికి పెండింగ్ ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, 2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

అమరావతిలో భూసమీకరణలో భాగంగా ప్లాట్లు పొందిన రైతుల్లో వీధిపోటు, ఇతర వాస్తు సమస్యలు ఉన్న 112 మందికి వేరే ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ అవకాశం ఒరిజినల్ అలాటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ. 5000 పెన్షన్‌ను, వారి తల్లిదండ్రులు మరణిస్తే మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు కూడా ఆమోదం లభించింది.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- మొదటి పేజి తరువాయి

నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి

శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మ న్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

**పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి**

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు.

హెడ్ రెగ్యులేటర్: శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్‌లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్స్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు.టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు.

ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫొటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్&ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

**పదేపదే తప్పుడు తేదీలు**

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2020 నుంచి 2023 వరకు నాలుగుసార్లు వేర్వేరు తేదీల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి, చివరకు ఏ పనీ చేయకుండా ఎన్నికల ముందు ప్రారంభోత్సవ నాటకమాడారని నిమ్మల విమర్శించారు. పూర్తికాని ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కావాలని వైకాపా ఎమ్మెల్యేలే అడగడం వారి మోసానికి సాక్ష్యమని అన్నారు. హంద్రీనీవా తరహాలోనే, వెలిగొండను కూడా 2026 నాటికి పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల దశాబ్దాల కలను నిజం చేస్తామని మంత్రి రామానాయుడు భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు."చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు.రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు.సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు.టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు.ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు.విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు,

రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్–కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్– 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.

## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు.భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

- మొదటి పేజి తరువాయి

ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## జనసేన కాదు.. కామసేన

- మొదటి పేజి తరువాయి

జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండపం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**పవన్, చంద్రబాబు, హోంమంత్రిపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ? ఏం చేస్తున్నారు?" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా?" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీ–మెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితపైనా రోజా విమర్శల వర్షం కురిపించారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, తన సొంత జిల్లా విశాఖలో డ్రగ్స్, గంజాయిని అరికట్టలేని మంత్రి రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. గతంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ అయినా, ఇప్పుడు సొంత పార్టీ, మిత్రపక్ష ఎమ్మెల్యేల అరాచకాలైనా మహిళలను కాపాడటంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఆయనో 'చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, హోంమంత్రి అనిత తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రోజా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవానికి రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. వైసీపీ ఆందోళనతో నగరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాను:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29: రెడ్ క్రాస్ అభివృద్ధికి, సేవ విస్తరించడానికి కృషి చేస్తానని కర్లపాలెం మండలతహసీల్దార్ కె .శ్రీదేవి అన్నారు. బుధవారం నూతనంగా తాసిల్దార్ బాధ్యతలు చేపట్టిన ఆమెను కర్లపాలెం రెడ్ క్రాస్ యూనిట్ మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్ఛమిచ్చే రెడ్ క్రాస్ కి చేయూతనివ్వాలని అన్నారు, మండలాన్ని అభివృద్ధి పదములో నడిపించాలని విజ్ఞప్తి చేశారుఈ సందర్భంగా కర్లపాలెం రెడ్ క్రాస్ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రెడ్ క్రాస్ చేయూత ఇస్తుందని, జీవితకాల సభ్యత్వం 11 00 మాత్రమే ఆసక్తి కలిగిన వాళ్లు సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మందపాటి పరమానంద కుమార్, కోశాధికారి బుర్ల రాజేష్, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు మరియు రెడ్ క్రాస్ సభ్యులు పేరలి ధనుంజయ రావు. తదితరులు పాల్గొన్నారు



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# "బాపట్ల సేవా సేతు" ద్వారా జిల్లా ప్రజలకు అభివృద్ధి ఫలాలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్:




పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:
బాపట్ల జిల్లా కొరకు రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్ అమలు తీరుపై సంక్షేమ శాఖల అధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో బుధవారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో హైబ్రిడ్ మోడ్ లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధ్టిుజూఫ్శ్రీఖ.జూ91.ఎశీఎ అనే వెబ్ సైట్ ను ఆవిష్కరించామన్నారు. ప్రజలందరికీ ఈ వెబ్ సైట్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహాలలోని విద్యార్థుల సమస్యలను గుర్తించి వెబ్ సైట్ లో నిక్షిప్తం చేయాలన్నారు. మీ విలువైన విరాళాలిచ్చే దాతలకు వేదికగా ఈ వెబ్ సైట్ నిలుస్తుందన్నారు. వెబ్ సైట్ రూపొందించడంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పి యశ్వంత్ విశేషంగా కృషి చేశారన్నారు. బాపట్ల జిల్లాకు ప్రత్యేకంగా లోగో రూపొందించాలన్నారు. ప్రజలకు నిరంతరం ఈ వెబ్ సైట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమికంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, బాలసదన్, బదిరుల పాఠశాల విద్యార్థులకు అవసరాలను గుర్తించి నిక్షిప్తం చేయాలన్నారు. ఆ వసతి గృహం చిరునామా, వసతి గృహ సంక్షేమ అధికారి ఫోన్ నెంబర్ వంటి పూర్తి వివరాలు అందులో పొందుపరచాలన్నారు. పూర్వ విద్యార్థుల ఫోన్ నెంబర్లను సేకరించి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. విరాళాలిచ్చే దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తే వారు అందించిన సహాయ సహకారాలను ఇతరులను ప్రోత్సహించేలా వెబ్ సైట్ లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కే సత్యనారాయణ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, బీసీ సంక్షేమ అధికారిని శివలీల, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పి యశ్వంత్, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ఉద్యోగ ఉపాధి నైపుణ్య అవకాశాలపై అవగాహన కార్యక్రమం:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:
దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. డి బి ఆర్ సి ఏరియా కోఆర్డినేటర్ యన్ శ్రీలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎంప్లాయిమెంట్ యంగ్ ప్రొఫెషనల్ ఈ హారిక మాట్లాడుతూ మారుతున్న సమాజంలో నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగాలకు తగిన విధంగా తవని మార్చుకున్న వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆవిడ అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ స్థాయిలలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ఎం బుల్లయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు నియోజకవర్గం స్థాయిలో స్కిల్ హబ్ లు ప్రభుత్వం ఏర్పరచిందని వాటిలో వివిధ శిక్షణలు ఇప్పించి ఉపాది కల్పించడం జరుగుతుందని తెలిపారు నిరుద్యోగ యువతీ యువకులు నైపుణ్యం పోర్టల్ లో తమ వివరాలను నమోదు చేసుకొని ఉద్యోగాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. తమ అలవాట్లలో మార్పులు చేసుకొని చదవడం నేర్చుకోవడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిన్న ప్రకటించిన గ్రూప్2 ఫలితాలలో ఉద్యోగం సాధించిన రాజీవ్గాంధీ కాలనీ సెకండ్ సచివాలయం అడ్మిన్ ఎం సామ్యూల్ రాజు ను డి బి ఆర్ సి సిబ్బంది మరియు అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్సి ఏరియా కోఆర్డినేటర్ వి భగవాన్ దాస్ వివిధ ప్రాంతాల నుంచి యువకులు పాల్గొన్నారు.



# కీ"శే"కజ్జం గురవయ్య జ్ఞాపకార్థం 300 మందికి అన్నదానం పంపిణీ కార్యక్రమం శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జనవరి 28:--
పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ వాసవి సేవా అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో దాతల కజం సీతారావమ్మ కుమారులు కజ్జం ఆంజనేయులు ధర్మపత్ని రామలక్ష్మి, కజ్జం చిన్న ఆంజనేయులు ధర్మపత్ని అరుణ, కజ్జం హనుమంతరావు ధర్మపత్ని రాధిక, అల్లుడు కూతురు బొగ్గవరపు హరిబాబు, ధర్మపత్ని అంజనీకుమారి వారి కుటుంబ సభ్యులు సహకారంతో 300 మందికి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగినది ఈ నారాయణ సేవా కార్యక్రమంలో కజం నాగభూషణం ధర్మపత్ని కోటమ్మ, కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, అన్నప్రసాద మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, మద్దు హైమావతి, మాడిశెట్టి పుష్పలత, సముద్రాల పద్మ, బచ్చు నాగమణి, వెలుగూరి అరుణ, భవనారి అనంతలక్ష్మి,సూరే ధనలక్ష్మి, ఊటుకూరి వాణి, ఊటుకూరి వెంకాయమ్మ, తదితరులు ఈ నారాయణ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు



# స్పైసెస్ బోర్డ్ మెంబర్గా బాధ్యతలు స్వీకరించిన కొత్తూరు వెంకట సుబ్బారావు...

బపెన్ పవర్,గుంటూరు:జనవరి, 28.
చుట్టుగుంటలోని స్పైసెస్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయంలో, స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అనన్ దేవ్ వర్మ చేతుల మీదుగా కొత్తూరు వెంకట సుబ్బారావు స్పైసెస్ బోర్డ్ మెంబర్గా నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ బాధ్యత తనకు లభించేందుకు సహకరించిన రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ కి, పూర్వ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి కి, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కి, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, ప్రముఖ ఆడిటర్ రాఘవరావు, హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరావు, జోసఫ్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



# సేవే మార్గం అంటున్న రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల:




పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:
ఈరోజు స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ స్థలం నందు రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో బల్లలు ఏర్పాటు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.... రోటరీ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సేవ చేయటంలో ఎప్పుడు ముందుంటుందని దానిలో భాగంగానే ఈ రోజున స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ స్థలం నందు ప్రభుత్వ అధికారుల కారు డ్రైవర్లు కూర్చునేదానికి బల్లలు కావాలి అని మా రోటరీ దృష్టికి మిత్రులు కారు డ్రైవర్ పవన్ సాయి తీసుకురావడం వల్ల బల్లలను నా ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిని వారు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, సీనియర్ రోటరీ సభ్యులు ఇ.హరిబాబు, బూర్లె రామ సుబ్బారావు, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి, డాక్టర్ వీర రాఘవయ్య, ఎస్ రమేష్ బాబు, జెవి కృష్ణారావు, జిట్టా శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, ఎం సుధీర్ కుమార్, టి మల్లికార్జునరావు తదితర రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రన్న పాలనలో మహిళా సాధికారతకు బలమైన పునాది..

## -ఎమ్మెల్యే గళ్ళా మాధవి..

బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 28.
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అన్న ఎన్టీఆర్ చంద్రన్న పాలనలో మహిళా సాధికారతకు బలమైన పునాది వేశారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వివి తెలుగుదేశం పార్టీ తెలుగుమహిళా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ని మర్యాదపూర్వకంగా కలుసుకుని, తమను కమిటీ సభ్యులుగా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే మహిళా సాధికారత, స్త్రీ సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మహిళా సమానత్వానికి నాంది పలికారని గుర్తు చేశారు. అదే విధంగా తొలిసారిగా మహిళలకు 33 శాసనసభ సీట్లు, 5 మంత్రి పదవులు ఇచ్చి రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచిన ఘనత ఎన్టీఆర్ దని పేర్కొన్నారు.
అనంతరం చంద్రబాబు నాయుడు పాలనలో మహిళలకు మరింత గౌరవం, అవకాశాలు కల్పించబడ్డాయని తెలిపారు. శాసనసభకు తొలి మహిళా స్పీకర్ను అందించిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని, ఎన్టీఆర్ మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడంతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా 'రాష్ట్ర మహిళా కమిషన్' ఏర్పాటు చేసిన దూరదృష్టి నాయకుడు కూడా చంద్రబాబు నాయుడు గారేనని అన్నారు.
మహిళా సాధికారత దిశగా భారతదేశంలోనే తొలిసారిగా మహిళా పార్లమెంటు సదస్సును నిర్వహించిన ఘనత కూడా చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. ఒకప్పుడు ఇంటికే, వంటింటికే పరిమితమైన తెలుగు మహిళను ప్రగతి బాట పట్టించి, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దడమే కాకుండా, మహిళల ఆత్మగౌరవం, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా తెలుగుదేశం పార్టీ మహిళల సంక్షేమం, హక్కులు, సాధికారత కోసం అంకితభావంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆధ్యాత్మికవేత్త పాలకుర్తి సీతారామయ్య చిరస్మరణీయులు





భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 28:
ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పాలకుర్తి సీతారామయ్య చిరస్మరణీయులని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. బుధవారం వాసవి దేవాలయంలో సీతారామయ్య 32వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె మానేపల్లి లక్ష్మీస్ సరోజిని ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన సాయిబాబా మాట్లాడుతూ ఆడిటర్ స్వర్గీయ మానెపల్లి నరసింహారావు మామగారైన పాలకుర్తి సీతారామయ్య వర్ధంతిని పురస్కరించుకొని 80 మంది పేదలకు అన్నదానం, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో పదవ తరగతి చదువుచున్న విద్యార్థులకు పరీక్ష మెటీరియల్, పౌష్టికాహారాన్ని అందించినట్లు సాయిబాబా పేర్కొన్నారు. సమావేశంలో బొలిశెట్టి శ్రీనివాసరావు,మద్దుల నారాయణ మాజేటి వెంకటేశ్వరరావు, పాలకుర్తి శివప్రసాద్ తదితరుల ప్రసంగంలో సీతారామయ్య మరియు నరసింహారావులు దేవస్థానం కు చేసిన సహకారం గ్రామంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శివప్రసాద్ చుండూరు మోహన్ రావు మానేపల్లి మహాబలేశ్వరరావు సంధ్యారాణి,పాలకుర్తి నిర్మల మాజేటి వెంకటేశ్వరరావు, ఆలపాటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి పెద్దపీట

## ప్రభుత్వ పథకాల అమలుపై అసెంబ్లీలో జాయింట్ కమిటీ విస్తృత సమీక్ష సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కీలక సూచనలు



నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 28: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై శాసనసభ జాయింట్ కమిటీ బుధవారం విస్తృతంగా సమీక్ష నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ హాల్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి జాయింట్ కమిటీ చైర్మన్ బీద రవిచంద్ర అధ్యక్షత వహించగా, కమిటీ సభ్యులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ వర్గాలకు సంబంధించిన విద్యా, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలపై లోతైన చర్చ జరిగింది. ముఖ్యంగా బీసీ సంక్షేమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు తీరుపై అధికారుల నుండి వివరాలు సేకరించారు. విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండేలా హాస్టళ్లలో వసతి, భోజనం, మౌలిక వసతులు మెరుగుపర్చాలని కమిటీ సభ్యులు సూచించారు. అలాగే తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానంపై చర్చించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ సమయానికి పూర్తి చేసి ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యా సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా బీసీ విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం, ఏపీ బీసీ స్టడీ సర్కిల్స్ పనితీరుపై కూడా సమీక్ష జరిగింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, ఉచిత వసతి, పుస్తకాలు, కోచింగ్ అందేలా మరింత పటిష్ట చర్యలు తీసుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. అనంతరం బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, ఎస్.ఆర్. శంకర్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాట్లలో వేగం పెంచాలని స్పష్టం చేశారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు

తదుపరి బీసీలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు పురోగతిపై కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి హామీని దశలవారీగా అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

అనంతరం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ విద్యార్థులకు ప్రభుత్వ పథకాల సమాచారం సకాలంలో అందడం లేదని, అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, భద్రత, శుభ్రత తప్పనిసరిగా ఉండేలా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బీసీ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నాలెడ్జ్ సెంటర్లు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.

ఈ సమావేశంలో శాసనసభ అధికారులు, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధి బాదుగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బీసీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు.

ఈ జాయింట్ కమిటీ సమావేశం బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా నిలిచిందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందేలా సమిష్టి కృషితో ముందుకు సాగాలని కమిటీ పిలుపునిచ్చింది.

# అఖిల భారత కిసాన్ ఎగ్జిబిషన్ జయప్రదం చేయండి....



బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 28.
అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా రేపు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ కోరారు.నేడు 2/7 బ్రాడీపేట లోని రైతు సంఘం ఆఫీసులో ఆయన మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా రేపటినుండి ఫిబ్రవరి 1 వరకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎగ్జిబిషన్ 4 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య ఎన్ . జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి ప్రారంభిస్తారని తెలిపారు, అనంతరం వికసిత్ భారత్ 2047 అనే అంశంపై ఐక్స్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ , మాజీ ఎంపీ మధు, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, రిటైర్ ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు, ఆర్ వీర రాఘవయ్య తదితరులు పాల్గొని ప్రసంగిస్తాతన్నారు. అనంతరం జరిగే సాంస్కృత కార్యక్రమాలను ప్రారంభించడానికి ప్రజా కళాకారులు వంగపండు దుష్యంత్ గారు వస్తున్నారని ఈ సందర్భంగా హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే వేమన సాంఘిక నాటకాన్ని ప్రదర్శించడం జరుగుతుందని జిల్లాలోని వివిధ కళాశాలలు స్కూల్స్ నుండి ప్రజానాట్యమండలి వారిపై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో గుమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నామనారు...

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ , అధికారులతో కలసి పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.



బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 28.
మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు 30వ తేదీన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి లో గుంటూరు మెడికల్ కాలేజీ ఆలూమినీ ఆఫ్ నార్త్ అమెరికా (జింకానా) వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన "డా. కానూరు జింఖానా – మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి భవనము" ను ప్రారంభించనున్నారు.ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు మరియు రూట్(రాకపోకల మార్గాల) ఏర్పాట్లను పరిశీలించేందుకు ఈ రోజు గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా మరియు ఇతర అధికారులతో కలసి పర్యటించి, ఎస్పీ ప్రాథమిక తనిఖీ నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటనను సురక్షితంగా, సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వీవీఐపీ రూట్ ఏర్పాట్లు, సభా ప్రాంగణం చుట్టుపక్కల భద్రత తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు సంబంధిత పోలీస్ మరియు ఇతర శాఖల అధికారులకు జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ , జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.ఎస్.వి.రమణ , రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు ,ఈస్ట్ డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ ,కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి , జింకానా ప్రతినిధులు బాబుల్ రెడ్డి , రామ కోటేశ్వర రావు , జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ , ఉప రవాణా కమిషనర్ సీతారాంరెడ్డి , తదితరులు పాల్గొన్నారు

# కబరస్తాన్‌లలో మౌలిక వసతులు కల్పించండి

## -శ్మశాన వాటికను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్..



బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 28.
వచ్చే నెల మూడో తేదీన షబేబరాత్ (పెద్దల పండుగ) కు కబరస్తాన్ లో మౌలిక వసతులు కల్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఆనంద పేట ముస్లిం శ్మశానవాటిక ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో మంచినీటి సరఫరా. శానిటేషన్ అంశాలపై అధికారులతో మాట్లాడారు. తాగునీటి పైపులైన్ల వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే క్లీన్ చేయించాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. శ్మశాన వాటికలో చిల్లచెట్లు పెరిగి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే.. వెంటనే వాటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముస్లిం మైనారిటీలు రాత్రంగా జాగారం ఉండి ప్రత్యేక దువా చేస్తారని తెలిపారు. దానధర్మాలు వంటి కార్యక్రమాలు చేపడతారని, మరణించిన తమ కుటుంబీకులు,



బంధువుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటారని తెలిపారు. ఆధ్యాత్మికంగా మనల్ని మనం శుద్ధి చేసుకునే సమయంగా భావిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని వెల్లడించారు.



# అంకిత భావంతో నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు: ఎంపీపీ

భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 28:
నిబద్ధతతో,అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి అధికారుల ఆశీస్సులు అందుతాయని మండల పరిషత్ అధ్యక్షురాలు, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి లు అన్నారు.భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేష్ మరియు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న రవికి గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలందించిన నేపథ్యంలో ఇది ఇరువురు అవార్డులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీరి రువురికి ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపీడీవో ఎస్. వెంకటరమణ, జడ్పీటీసీ టి ఉదయభాస్కరీ ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో సిహెచ్ జలజ, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జునరావు ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ మరియు మండల పరిషత్, మండల సమైక్య కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త శ్రీనివాసరావు కుటుంబాని ఆదుకున్న కీ"శే"సంగినేడి ధనుంజయ రావు సేవా ట్రస్ట్

**నెలకు సరిపడా నిత్యవసర సరుకులు 3000 రూపాయల నగదు సహకరించిన సంగినేడి బాలకృష్ణ- నగదు అందజేసిన ట్రస్ట్ సభ్యులు**



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జనవరి 28:-- పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలో శ్రీ వీర్ల అంకాలమ్మ తల్లి దేవస్థానంలో గుత్తికొండ గ్రామానికి చెందిన పేద ఆర్యవైశ్యుడు కొత్త శ్రీనివాసరావు కుటుంబానికి అనారోగ్యంతో ఇబ్బందులను తెలియపరిస్తే వారికి సహాయం చేయాలని ముందుకు వచ్చిన కీర్తిశేషులు సంగినేడి. ధనుంజయరావు సేవా ట్రస్ట్ కన్వీనర్ సంగినేడి బాలకృష్ణ నెలకు సరిపడా నిత్యవసర సరుకులు 3000 రూపాయలు నగదును ట్రస్ట్ సభ్యులచే అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు గణితి అమరయ్య, టిడిపి పట్టణ నాయకులుపలిశెట్టి కొండ (ఆపరేటర్), తోట నరసింహారావు (అబ్బాయి), పలిశెట్టి శీను, బొమ్మిన శ్రీనివాసరావు (పెదకాపు), పలిశెట్టి హనుమంతరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముళ్ళపాటి కొండ, శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు





# పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

**ఇరువురి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చిన రెండో పట్టణ పోలీసులు.**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 28: ఓ ప్రేమ జంట తమ కుటుంబ సభ్యుల నుండి రక్షణ కల్పించవలసిందిగా బుధవారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇరువురు మేజర్లు కావడంతో చట్టపరంగా వివాహం చేసుకున్నారని వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిందిగా ప్రేమజంట తల్లిదండ్రులకు పోలీసులు సూచించారు. నరసరావుపేటకు చెందిన దేవర ఉపేంద్ర , వినుకొండ కు చెందిన పాలపాటి పావనీ లు గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. బుధవారం కనపర్తి చర్చిలో వివాహం చేసుకున్నారు. తమ తల్లిదండ్రుల నుండి రక్షణ కల్పించవలసిందిగా పోలీసుల ను ఆశ్రయించడంతో పోలీసులు ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి కథను సుఖాంతం చేశారు.

# మట్టిలో ఆణిముత్యం పేదరికాన్ని జయించి పట్టుదలతో గ్రూప్2లో సత్తా చాటిన ఒప్పిచర్ల మహిళా

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జనవరి 28:--
పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, ఒప్పిచర్ల గ్రామానికి చెందిన మహిళా వల్లెపు. వెంకటలక్ష్మి గ్రూప్2లో ఉత్తమ ఫలితాలు సాధించి, సంకల్పంతో విజయాన్ని అందుకున్నారు.పట్టుదల ముందు పేదరికం ఓడిపోతుందనే నిజాన్ని పల్నాడు మహిళా మరోసారి నిరూపించింది. కష్టాలను తట్టుకొని, పరిస్థితులను ఎదుర్కొని గ్రూప్2 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే తపన ఉండాలని సందేశాన్ని సమాజానికి ఇచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని, ప్రస్తుతం కారంపూడి మండలం, నరమాలపాడు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేసుకుంటూ.. పరిమిత వనరులతోనే ఉన్నత స్థాయికి చేరడం ద్వారా వేలాది యువతకు ప్రేరణగా నిలిచారు. వివాహం చేసుకొని ఇద్దరు పిల్లలు ఉన్నా కూడా పట్టు వదలకుండా గ్రూపు టు



సాధించడం ఎంతగానో చెప్పుకోదగ్గ విషయమే.. ఈ సందర్భంగా బుధవారం ఆమె కారంపూడి లోని తమ నివాసం లో మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు కొండలు, రమణ, భర్త రాజు సహకారంతోనే... సచివాలయంలో ఉద్యోగం చేసుకుంటూ చదువుకొని గ్రూప్-2 లో విజయం సాధించటం జరిగిందని ఆమె తెలియదు. గ్రూప్-2 లో విజయం సాధించడంలో మా కుటుంబ సభ్యుల పాత్ర ఎంతగానో ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# "ఎస్సీ కార్పొరేషన్ వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

## సంక్షేమ శాఖ వైస్ చైర్మన్ డైరెక్టర్ ఎం. నాయక్





మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 28:
బుధవారం సాయంత్రం ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి కలెక్టరేట్లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో భూమి కొనుగోలు పథకం లబ్ధిదారులు, నేషనల్ షెడ్యూల్డ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ ఎస్ ఎఫ్ డి సి), నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ ఎస్ కేఎఫ్డిసి) పథకాల లబ్ధిదారులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వడ్డీ మాఫీ సద్వినియోగంపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ 201516 నుండి 201819 మధ్య కాలంలో ఎన్ ఎస్ ఎఫ్ డి సి, ఎన్ ఎస్ కేఎఫ్డిసి పథకాల ద్వారా రుణాలు పొందిన నిరుపేద ఎస్సీ లబ్ధిదారులు, 2025 డిసెంబర్ 31వ తేదీ నుంచి 2026 ఏప్రిల్ 30వ తేదీ వరకు రుణం మొత్తం చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేయబడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తీసుకున్న రుణానికి వడ్డీ కాకుండా అసలు మాత్రమే చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అవకాశం కల్పించిందని, ఇది ఎంతో లబ్ది చేకూరుతుందని, సద్వినియం చేసుకోవాలన్నారు. దీనివల్ల సిబిల్ స్కోర్ కూడా మెరుగవుతుందని, భవిష్యత్తులో రుణాలు పొందడానికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మగినం స్వతంత్రరావు 201819 కాలానికి సంబంధించిన ట్రాక్టర్ రుణం రూ.2.50 లక్షలు వన్ టైం సెటిల్మెంట్ ద్వారా కార్పొరేషన్ కార్యాలయంలో చెల్లించగా లబ్ధిదారున్ని వారు ప్రత్యేకంగా అభినందించారు.సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణవేణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రమేష్, సోషల్ వెల్ఫేర్ డిడి సాహిత్ బాబు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, ఎస్సీ కార్పొరేషన్ ఈవో సెల్వి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# "క్రమశిక్షణ, శ్రద్ధతో చదువుకోండి.. జిల్లా కలెక్టర్"

## - స్కూల్ పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ









మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 28:
బుధవారం జిల్లా కలెక్టర్ గుడివాడ నియోజక వర్గం గుడ్లవల్లేరు మండలం, పెడన నియోజకవర్గ కేంద్రంలో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేశారు. అలాగేప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ పాటవాలను పరీక్షించారు.తొలుత జిల్లా కలెక్టర్ గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇక పదవ తరగతి పరీక్షలకు 46 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అలోగా క్రమశిక్షణ,శ్రద్ధతో చదివితే పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించవచ్చన్నారు . ఏ సబ్జెక్టు బాగా నేర్చుకోగలిగాము, ఏ సబ్జెక్టు ఇంకా బాగా చదువుకోవాల్సిన అవసరం ఉన్నదో విద్యార్థులు వారికి వారే అంచనా వేసుకోవాలన్నారు.తెల్లవారుజామునవే మనసు ప్రశాంతంగా ఉంటుందని ఆ సమయంలో కొన్ని గంటలు కేటాయించి శ్రద్ధగా చదువుకునే అలవాటు చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు.మిగిలిన సమయాల్లో వివిధ రకాల ఆలోచనలతో సరిగా చదువుకునే పరిస్థితి ఉండదన్నారు.పదవ తరగతిలో క్రమశిక్షణతో సీరియస్ గా చదివే అలవాటు చేసుకుంటే అది జీవితాంతం ఉంటుందని తద్వారా ఉన్నత ఏరంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం లభిస్తుందన్నారు.రానున్న ఒకటిన్నర నెల రోజులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు.
తదుపరి పెడన మున్సిపల్ పరిధిలోనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించి ఉపాధ్యాయులుగా మారి కూడికలు, తీసివేతలు ఎంతమేరకు చేయగలుగుతున్నారో స్వయంగా పరీక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఎలా బోధించాలి అనే విషయాలపై ఉపాధ్యాయులకు విశదీకరించారు. వడ్లమన్నాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించి విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేశారు.
తదనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఫౌండేషనల్ లీటరసి న్యూమరసి(ఎఫ్ ఎల్ ఎన్) కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ఇందుకోసం ప్రాథమిక పాఠశాలలో న్యూమరసి బేసిక్స్ ఎంతవరకు అమలు అవుతుందో పరిశీలించడం జరుగుతుందన్నారు.
అలాగే ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను బాగా వ్రాసేందుకు వీలుగా నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు.
ఇందులో ఇప్పటికే 54 రోజులు గడిచిపోయాయన్నారు..
ఇప్పటివరకు విద్యార్థులు ఏమాత్రం సబ్జెక్టులు నేర్చుకున్నారో పరీక్షలు ఏ విధంగా తయారవుతున్నారు గమనించేందుకు పాఠశాలలను సందర్శిస్తున్నామన్నారు.ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామని వారు ఏ విద్యార్థికి ఏ సబ్జెక్టులో సహాయం కావాలో తెలుసుకుని ఆ సహాయం అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అంతే కాకుండా ప్రతి విద్యార్థికి ఉపయోగపడే విధంగా ప్రత్యేకించి స్టడీ మెటీరియల్ అన్ని పాఠశాలలకు అందజేశామన్నారుక్రమం తప్పకుండా స్లిప్ టెస్టులను నిర్వహిస్తున్నామని, నూటికి నూరు శాతం విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డి ఈ ఓ సుబ్బారావు, స్థానిక ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేట అభివృద్ధికి మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి కృషికి అభినందనలు : మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 28 :
చిలకలూరిపేట: స్థానిక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై మాజీ మంత్రి శాసనసభ్యులకు ఉన్న చిత్తశుద్ధిని కొనియాడారు. ప్రజా క్షేమమే లక్ష్యం: ప్రజల సంతోషం, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రత్తిపాటి పుల్లారావు పనిచేస్తున్నారని రఫాని పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి ఆయన లాంటి నిబద్ధత గల నాయకుడు ఉండటం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని ఛైర్మన్ అభివర్ణించారు. అందరూ అభివృద్ధి చెందాలనే ఉన్నత ఆశయంతో ఆయన సాగిస్తున్న నాయకత్వం కేవలం నియోజకవర్గానికే కాకుండా, రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు.కమ్యూనిటీ హాల్ కోసం నిధులు కేటాయించి, ప్రజల అవసరాలను తీర్చినందుకు గాను పట్టణ ప్రజలకు పక్షాన మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ఛైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు



# ఓటు నమోదు ప్రక్రియ సులభతరం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 28 :
చిలకలూరిపేట : ఓటు నమోదు ప్రక్రియను సైతం ఎన్నికల కమిషన్ సులభతరం చేసిందని, ఆన్లైన్ ద్వారా నమోదు కావచ్చని, యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి అని మేరా భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మరియు మై భారత్, గుంటూరు మరియు చిలకలూరిపేట లోని ఏ ఎం జి ఇండియా ఇంటర్నేషనల్ సంయుక్త అద్వర్యం లో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఏ ఎం జి ఇండియా ఇంటర్నేషనల్ లో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఓటరు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఓటరుగా సమాజాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఏ ఎం జి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం వీరరాఘవులు మాట్లాడుతూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలి ఉన్న యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు మై




భారత్ మై ఓటు అక్షరాల ఆకృతిని ప్రదర్శన చేశారు. తదనంతరం ఓటు హక్కు గురించి విద్యార్థిని విద్యార్థులు అందరూ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఆద్యంతం కోలాహలం జరిగిన ఈ అవగాహనా ర్యాలీలో విద్యార్థిని, విద్యార్థులు ప్లకార్డ్స్ తో పాల్గొన్నారు. నూతనంగా ఓటు హక్కును నమోదు చేసుకున్న విద్యార్థులను ఏ.ఎం.జి ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మొహంతి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వాహకులు వీరిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఎం జి హై స్కూల్ ప్రిన్సిపల్ కే కృపాదానం , ఏ. ఎం. జి ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం.మణిదీపక్ , కళాశాలల లెక్చరర్లు, ఏ. ఎం. జి హై స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 7, 8 న రాష్ట్రం గర్వించేలా కొండవీడు ఉత్సవాలు : ప్రత్తిపాటి

**7వ తేదీ తొలిరోజు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ : ప్రత్తిపాటి.**

**ఫిబ్రవరి 10 నుంచి వేసవి ముగిసేవరకు కొండపై ప్రత్యేక టెంట్ లలో పర్యాటకుల రాత్రి బసకు ఏర్పాట్లు : ప్రత్తిపాటి.**

**కొండవీడు వైభవం. చరిత్ర, గొప్పతనం తెలిపేలా ప్రత్యేక గీతావిష్కరణ.. 5 వ తేదీన ప్రత్యేక కర్టెన్ రైజర్ : ప్రత్తిపాటి.**

**కొండవీడు ఉత్సవాల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, వివిధ శాఖల అధికారులతో కలిసి కోటను పరిశీలించి అక్కడే సమీక్ష నిర్వహించిన మాజీమంత్రి.**





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 28 :
చిలకలూరిపేట : కొండవీడు ఉత్సవాలకు ఉన్న చారిత్రక ప్రాధాన్యత, విశిష్టత, వైభవాలను గత ప్రభుత్వం విస్మరించిందని, గతంలో చంద్రబాబునాయుడి ముఖ్యమంత్రిత్వంలో ఘనంగా ఉత్సవాలు జరిగాయని, మరలా ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇకపై ప్రతి ఏటా ఉత్సవాల నిర్వహించబోతున్నామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కొండవీడు ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మాజీమంత్రి ప్రత్తిపాటి, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా బుధవారం చారిత్రక ప్రదేశంలోనే సమీక్ష నిర్వహించారు. కొండవీడును సందర్శించిన మాజీమంత్రి, జిల్లా కలెక్టర్ ఉత్సవాల ఏర్పాట్లు, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఇరువురూ విలేకరులతో మాట్లాడారు.

తొలిరోజు ఉత్సవాల ప్రత్యేక అతిథి పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్

ఫిబ్రవరి 7,8 తేదీల్లో కొండవీడు హెరిటేజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని ప్రత్తిపాటి చెప్పారు. ఈ ఉత్సవాల తొలిరోజున ప్రత్యేక అతిథిగా రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ హాజరవుతారని చెప్పారు. అలానే రెండోరోజు మరో ఇద్దరు మంత్రులు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, వారి అంగీకారం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. కేంద్రమంత్రి పెమ్మసానితో సంప్రదిస్తున్నామని, ఆయన కూడా వచ్చేలా చూస్తామన్నారు.

ఫిబ్రవరి 10 నుంచి వేసవి ముగిసేవరకు కొండపై ప్రత్యేక టెంట్ లలో పర్యాటకుల రాత్రి బసకు ఏర్పాట్లు

కొండవీడు కోట కేంద్రంగా శ్రీకృష్ణదేవరాయలు, రెడ్డిరాజులు పాలన సాగించారని, ఆనాటి ఘన కీర్తికి అద్దం పట్టేలా, నాటి చరిత్ర..వైభవం నేటి తరాలకు తెలిసేలా ఒక ప్రత్యేక గీతాన్ని రూపొందిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. తొలిరోజున ఆ గీతాన్ని విడుదల చేస్తామన్నారు. కొండవీడు కోటలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి పురావస్తుశాఖ అనుమతులు లభించినందున కోటపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దర్గా, మసీదులకు మరమ్మతులు చేయించనున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఫిబ్రవరి 10 వ తేదీ నుంచి వేసవి ముగిసేవరకు రాత్రిళ్లు కూడా పర్యాటకులు కోటపై బసచేసేలా ప్రత్యేక టెంట్ లు ఏర్పాటు చేయబోతున్నామని, వారికి అవసరమైన వసతి, భోజన ఏర్పాట్లకోసం ప్రసిద్ధి చెందిన ఆహారతయారీ, సరఫరా కేంద్రాలను కూడా కోటపైనే ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు.

కొండవీడు మార్గంలో రూ.220 కోట్ల అంచనా వ్యయంతో టన్నెల్ నిర్మాణం

కొత్తపాలెంలోకి వెళ్లే పనిలేకుండా ఊరి బయట నుంచే కొండవీడుకోటకు చేరేలా మార్గాన్ని ఏర్పాటుచేశామని, అదే విధంగా చౌడవరం నుంచి కోటకు వచ్చే మార్గంలోని 5 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. ఈ టన్నెల్ రూ.220 కోట్ల అంచనావ్యయంతో నిర్మిస్తామని గతంలోనే చంద్రబాబు ప్రకటించారని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. టన్నెల్ పూర్తయితే, గుంటూరు నుంచి నేరుగా కోటకు వచ్చేవారికి దూరం తగ్గి, ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు.టన్నెల్ నిర్మాణాన్ని 2026లో పూర్తయ్యేలా చూడాలని గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు తెలియచేయడం జరిగిందని, సీఎం కూడా సానుకూలంగా స్పందించారని ప్రత్తిపాటి వివరించారు. కోటను చారిత్రక, పర్యాటక కేంద్రంగానే కాకుండా, ప్రజల శుభకార్యాల నిర్వహణకు ఒక ప్రత్యేక కేంద్రంగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో ఉన్న ప్రఖ్యాత చారిత్రక, పర్యాటకప్రాంతమైన కొండవీడుకోటకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు, జాతీయ పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమిప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయసహకారాలతో తనవంతు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చేయాల్సిన కృషి చేస్తున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఇకపై ప్రతి ఏటా జనవరి 18 నుంచి 23 వరకు జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు.. ఫిబ్రవరి తొలి శని, ఆదివారాల్లో కొండవీడు ఉత్సవాలు

ఇకపై ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శని, ఆదివారాలు కొండవీడు కోట ఉత్సవాలు నిర్వహిద్దామన్న జిల్లా కలెక్టర్ సూచనకు అంగీకరించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఇకపై ప్రతిఏటా జనవరి 18 (ఎన్టీఆర్ వర్ధంతి) నుంచి జనవరి 23 (లోకేశ్ జన్మదినం) వరకు చిలకలూరిపేటలో జాతీయస్థాయి ఎడ్లపందేలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని, అలానే ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శని, ఆదివారాలు రెండురోజులు కొండవీడు చారిత్రక ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. చారిత్రక ఉత్సవాలకు విద్యార్థినీ, విద్యార్థులు, యువత ఎక్కువగా వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, లేజర్ షో, రోప్ రైడింగ్ హెలికాప్టర్ రైడ్, శాండ్ ఆర్ట్ వంటి ప్రజాకర్షక కార్యక్రమాలు ఉంటాయని ప్రత్తిపాటి చెప్పారు. అలానే కోటపై ప్రత్యేక జంతుప్రదర్శనశాల, సఫారీ రైడింగ్ ఏర్పాటు ఆలోచన చేస్తున్నామన్నారు.

5వ తేదీన ఉత్సవాల ప్రాశస్త్యం తెలిసేలా ప్రత్యేక కర్టెన్ రైజర్


కొండవీడు ఉత్సవాల ప్రచార కార్యక్రమానికి సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 5న నిర్వహించనున్నామని ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు కోటకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, కొండపై మూడుచెరువులు, దేవాలయాలు, మసీదు వంటి విశిష్ట ప్రదేశాలు ఉండటం దేశంలో ఎక్కడా లేదని ప్రత్తిపాటి చెప్పారు. ప్రభుత్వ సహకారంతో ప్రతి ఏటా ఇకపై ఏటికేడు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. టీడీపీ హయాంలో కోటపై జరిగిన ఉత్సవాలు తప్ప, గత ప్రభుత్వంలో అక్కడ ఎలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. గతంలో హిమాంశు శుక్లా ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఉన్నప్పుడు ఉత్సవాలు జరిగాయని, నేడు పల్నాడు జిల్లా కలెక్టర్ గా కృతికా శుక్లా ఆధ్వర్యంలో మరలా జరగడం విశేషమని, ఇద్దరూ సమర్థవంతమైన అధికారులని ప్రత్తిపాటి తెలిపారు. కొండవీడు ఉత్సవాల ప్రాధాన్యత, వైభవాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాలు, కూటమి పార్టీల సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

యువత, విద్యార్థులు, మహిళలు మెచ్చేలా కొండవీడు ఉత్సవాల నిర్వహణ : జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

మన జిల్లాలో కొండవీడు ఉత్సవాలు ఇప్పుడు మూడోసారి జరుగుతున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లపై నేడు పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు. సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించాము. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫిబ్రవరి 7వ తేదీన ఉదయం యోగాకార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభించనున్నాం. 7, 8 రెండు రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో భాగంగా హెలికాప్టర్ రైడింగ్, బోటింగ్, హార్స్ రైడింగ్, రాక్ క్లైంబింగ్, లేజర్ షో, ఫ్లవర్ షో, శాండ్ ఆర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. కొండ దిగువన పార్కింగ్ ఏర్పాటుచేశాం. పర్యాటకులకోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేయనున్నాం. పర్యాటకులు తప్పనిసరిగా బస్సుల్లోనే రావాలి. విద్యార్థినీ విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేలా నృత్యం, గానం, నటన సహా వారికోసమే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. చివరిరోజున జబర్దస్త్ బృందంతో వినోద కార్యక్రమం.. గాయని గీతామాధురితో సంగీత విభావరి, ఒడిశా, ఉత్తరాంధ్ర కళాకారులతో ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నాం. అని జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఎస్పీ జీ.వి.సంతోష్, డిఎఫ్వో కృష్ణప్రియ, ఆర్డీవో మధులత, వివిధ శాఖల అధికారులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, పోపూరి వెంకయ్య, సొసైటీ చైర్మన్ సుబ్బారావు, మద్దూరి శ్రీనివాస రెడ్డి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, గ్రామ నాయకులు, ఎమ్మార్వో, ఎంపీడీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



## -పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు....

పత్తికొండ పెన్ పవర్ క
పత్తికొండ:ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్ అన్నారు. పత్తికొండ మండలం జూటూరు గ్రామంలో మన ఊరికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వము నుండి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబల్ ఇంజన్ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల తో దూసుకుపోతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో పేదరికానికి కూడా ముగింపు ఇచ్చేలా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి జూటూరు గ్రామ అభివృద్ధికి కోటి రూపాయలతో నిధులు మంజూరు చేశారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో 70 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. జూటూరు గ్రామానికి పందికోన రిజర్వాయర్ నుండి పిల్ల కాలువ ద్వారా సాగునీటి సౌకర్యం కల్పిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మద్దతు ధరలు, పంటబీమా, ఉచిత ఇసుక, పెంచిన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, పిహెచ్ సిల్లో మెరుగైన సేవలు ,విద్యార్థులకు తల్లికి వందనం , మహిళలకు ఫ్రీ బస్సు , స్కూళ్ల ఆధునికీకరణ, మహిళలకు డ్వాక్రా బలోపేతం, ఉచిత రేషన్, మహిళా భద్రత, యువతకు స్కిల్ డెవలప్మెంట్, ఉద్యోగ అవకాశాలు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు . రానున్న ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన మోదుగుల బసవన్న రెడ్డి...



పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29
తాడేపల్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయము నందు పార్టీ అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలసిన రాష్ట్ర కార్యదర్శి చీరాల,పర్చూరు నియోజకవర్గాల అబ్జర్వర్ మోదుగుల బసవపున్నారెడ్డి

# మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి బెయిల్ మంజూరు కావాలని అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**అధిక సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరుకుంటూ**

**వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు. (జు॥శ. సొసైటీ చైర్మన్)**



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జనవరి28:--- మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోవై యస్ అర్ కాంగ్రెస్ పార్టీ కారంపూడి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 29వ తారీకు గురువారం ఉదయం 10గంటలకు పల్నాటి ఆరాధ్య దైవం మహిషాసుర మర్దిని శ్రీ వీర్ల ఆశీకాలమ్మ తల్లి గుడిలో మన పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి గారు మరియు సోదరుడు పిన్నెల్లి వెంకట రామిరెడ్డి గార్లకు బెయిల్ మంజూరు కావాలని ప్రత్యేక పూజ కార్యక్రమం కలదు అని బొమ్మిన అల్లయ్య మీడియా కి తెలియజేశారు . కావున కారంపూడి గ్రామంలోని ప్రతి ఒక్క వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని తెలిపారు ....

# లోకేష్ కు, పవన్ కు ప్రమోషన్

**విజయవాడ, జనవరి 28 పెన్ పవర్:** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. మరో నెలలో రెండేళ్ల పాలన పూర్తవుతుంది. ఇప్పటివరకు సజావుగా పూర్తి చేసామన్న సంతృప్తి కూటమిలో ఉంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాల దిశగా కూటమి ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ ప్రమోషన్, పట్టాభిషేకం వంటి ప్రచారం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. ఒకవేళ లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలంటే పవన్ నుంచి అభ్యంతరం రాదా? అనే చర్చ కూడా బలంగా సాగుతోంది. అయితే ఏది ఏమైనా మూడు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాయి. అందుకే కూటమి అంతర్గత నిర్ణయాలు సైతం మూడు పార్టీల మధ్య జరగాలన్నది ఒక ప్రతిపాదనగా ఉన్నట్లు తెలుస్తోంది.2027 ద్వితీయార్థంలో మంత్రి నారా లోకేష్ ప్రమోషన్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పాటు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే పార్టీ పై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు లోకేష్. ఆపై తన మంత్రి పదవి విషయంలో సైతం సక్సెస్ అయ్యారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల ఏర్పాటు వంటి విషయంలో విజయం సాధించారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. అదే సమయంలో బిజెపి అగ్ర నేతల ఆశీస్సులు కూడా అందుకున్నారు. వారి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే ఏకంగా లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి కట్ట పెడతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి సాహసానికి దిగుతారా అనేది చర్చ. ఎందుకంటే అమరావతి రాజధానిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల ఏర్పాటు జరుగుతున్నా యి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార మార్పిడి జరిపితే దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. అందుకే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని తెలుస్తోంది.రాష్ట్రంలో లోకేష్ ప్రమోషన్, పవన్ కళ్యాణ్ కు ప్రత్యామ్నాయ అవకాశాలు జరగాలంటే 2029 ఎన్నికల తరువాతే. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఏపీలో మంత్రిగా ఉన్నారు. ఆపై డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు. మరోవైపు సనాతన ధర్మం అంటూ జాతీయ స్థాయిలో సైతం ప్రభావం చూపుతున్నారు. తరచూ వివిధ రాష్ట్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో సైతం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పవన్ కళ్యాణ్ ద్వారా రాజకీయం చేయాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ పరిస్థితులు చూస్తుంటే 2029 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ లో కీలక బాధ్యతలు కట్టబెట్టి జాతీయస్థాయి రాజకీయాల కోసం పవన్ కళ్యాణ్ ను వాడుకుంటారు అన్న చర్చ జోరుగా సాగుతోంది.2029 సార్వత్రిక ఎన్నికలతోపార్టీ ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళ్తాయి. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తారు. లోకేష్ తిరిగి అసెంబ్లీకి పోటీ చేస్తారు. కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వారిలో ఉంది. అప్పుడు కూడా చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయం. కేంద్రంలో పవన్ కళ్యాణ్ తిరుగులేని శక్తిగా ఉంటారు. ఏపీలో కూటమికి రక్షణ కవచంగా నిలుస్తారు. అటువంటి సమయంలో చంద్రబాబు వయసు దృష్ట్యా సీఎం పదవి నుంచి తప్పుకుంటే లోకేష్ కు పట్టాభిషేకం చేయడం ఖాయం. కేంద్ర పెద్దల భరోసాతో, పవన్ కళ్యాణ్ సమ్మతితో ఇది జరిగే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో పదవుల మార్పు అనేది 2029 ఎన్నికల్లో విజయాలను అనుసరించి ఉంటుంది. అంతవరకు ఎటువంటి మార్పు ఉండదు అన్నది విశ్లేషకుల మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అమరావతికి బాలయ్య దూరం

**అనంతపురం, జనవరి 28 పెన్ పవర్:** హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కొంత ఏపీ రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు కనపడుతుంది. ఆయన హిందూపురం నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఆయన త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నందమూరి బాలకృష్ణ ఉన్నది ఉన్నట్లు మాట్లాడతారు. ఏదీ మనసులో ఉంచుకోరు. అది శాసనసభ అయినా.. బహిరంగ సభ అయినా ఆయనకు ఒక్కటే. తాను అనుకున్నది బయటకు చెప్పేయడమే బాలకృష్ణకు అలవాటు. అదే అనేక సార్లు రాజకీయంగా పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. గత నవంబర్ లో జరిగిన శాసనసభ సమావేశాల్లో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కూటమిలోని పార్టీలను షేక్ చేశాయి.శాసనసభలో చిరంజీవిని ప్రస్తావన తెచ్చి టీడీపీ నాయకత్వానికి ఇబ్బందిగా మారారు. . ఇక అదే సమయంలో దీనిపై ఎవరు ఎంత రచ్చ చేసినా ఆయన నోటి నుంచి ఎటువంటి క్షమాపణ అన్న పదం రాలేదు. అందుకే నాడు చంద్రబాబు నాయుడు స్వయంగా పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి మాట్లాడాల్సి వచ్చింది. ఇక ఆ వివాదం సద్దుమణిగిన తర్వాత నందమూరి బాలకృష్ణ ఏపీ రాజకీయాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. అసలు విజయవాడ కు రావడమే మానేశారు. తనకు ఏదైనా పనులు ఉన్నా హిందూపురం నియోజకవర్గంలో సమస్యలున్నా నేరుగా చంద్రబాబుకో, లోకేశ్ కో ఫోన్ చేసి పరిష్కరించుకుంటున్నారు కానీ అమరావతిలో మాత్రం అడుగు పెట్టలేదు.ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లో ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చిన నందమూరి బాలకృష్ణ నివాళులర్పించి కేవలం ఎన్టీఆర్ గురించి నాలుగు మంచి మాటలు మీడియాతో మాట్లాడారు. అంతకు మించి రాజకీయాల జోలికి ఆయన వెళ్లలేదు. ప్రతిసారీ అక్కడ కూడా రాజకీయాలు మాట్లాడే నందమూరి బాలకృష్ణ ఈసారి మాత్రం ఆ పనిచేయకపోవడంపై అందరిలోనూ చర్చ మొదలయింది. నందమూరి బాలకృష్ణను పార్టీ నాయకత్వం దూరంగా ఉండాలని చెప్పిందని అనుకోలేం. ఎందుకంటే బాలకృష్ణను అలా నియంత్రించలేరు. కానీ నందమూరి బాలకృష్ణ మాత్రం మౌనంగా ఉండటం వెనక ఏదో ఒకటి జరిగి ఉంటుందన్న ప్రచారం బాలయ్య బాబు ఫ్యాన్స్ లో అనుమానం కలుగుతుంది. ఇంతకీ లెజెండ్ సైలెన్స్ వెనక సినిమా షూటింగ్ లే కారణమా? లేక తన మాట కూటమి ప్రభుత్వంలో చెల్లుబాటు కావడం లేదన్న అసహనమా? అన్న చర్చ జరుగుతుంది.

## ఏపీకి కేంద్రం శుభవార్త.. భారీగా నిధులు విడుదల,

**విజయవాడ, జనవరి 28పెన్ పవర్:** నరేగా పనులకు కేంద్రం తీపికబురు చెప్పింది. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.740 కోట్లు విడుదల చేసింది. దీంతో సామగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చి, పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రం ఈ నిధుల విడుదల చేయడాన్ని స్వాగతించారు.ఏపీకి కేంద్రం తీపికబురు చెప్పింది.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద మెటీరియల్ కాంపోనెంట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి విడుదల చేశాయి. ఈ నిధుల విడుదలతో నరేగా పనులకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగేది. ఇప్పుడు ఈ నిధులతో ఆ సమస్య తీరుతుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.480.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.259.13 కోట్లు కలిపి మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేస్తారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది నాలుగో విడతలో మొదటి విడతగా ఈ నిధులను విడుదల చేశారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడానికి కూడా ఇది దోహదపడుతుంది. రాష్ట్రానికి కేంద్రం మెటీరియల్ నిధులు విడుదల చేయడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల విడుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందన్నారు.కేంద్రం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన మెటీరియల్ పనులకు ఊతమిస్తుంది. కేంద్రం విడుదల చేసిన రూ.556 కోట్లలో, నాలుగో విడతగా రూ.480 కోట్లు, గతంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.75 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాన్ని స్పర్శ అకౌంట్ ద్వారా రాష్ట్రానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం నిధులను, అంటే రూ.185 కోట్లను జమ చేయాల్సి ఉంటుంది. అప్పుడు మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ పనుల కోసం అందుబాటులోకి వస్తాయి. ఈ నిధులతో అక్టోబర్ వరకు పూర్తయిన మెటీరియల్ పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇది కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటానికి సహాయపడుతుంది.'ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి కీలక ముందడుగు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వీ+చీ=జు+ూ పథకం కింద మెటీరియల్ భాగానికి కేంద్ర ప్రభుత్వం ₹480.87 కోట్ల సహాయాన్ని మంజూరు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాల ప్రయోజనం కలిగించే పనులు వేగంగా, నిరంతరంగా చేపట్టేందుకు బలమైన మద్దతు లభించింది. ఈ నిధులు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, గ్రామస్థాయి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ అంకితభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి దూరదృష్టి నాయకత్వంలో, కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారి మార్గదర్శకత్వంలో, అలాగే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి సమర్థ అమలుతో ఈ సహాయం గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పును తీసుకురానుంది' అంటూ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్ చేశారు.

## తుని రైల్వేస్టేషన్ లో కొత్త శోభ

విజయవాడ, జనవరి 28 పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అనేక రైల్వ్ స్టేషన్లలో అభివృద్ధ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ కొత్త శోభను సంతరించుకుంది. రూ.19 కోట్ల నిధులతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్లాట్ ఫామ్‌ల ఆధునీకరణ, వెయిటింగ్ హాళ్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ ఫోటోలను రైల్వేశాఖ షేర్ చేసింది.ఏపీలోని పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పథకమైన అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాష్ట్రంలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంతో.. తుని రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకుంది. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద తుని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చేశారు. అలాగే కొత్తగా మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రయాణికులు నిరీక్షించేందుకు నిర్మించిన వెయిటింగ్ హాళ్లను ఆధునిక టాయిలెట్లతో అప్ గ్రేడ్ చేశారు. తుని రైల్వే స్టేషన్ ముఖద్వారంతో పాటుగా స్టేషన్ ప్రాంగణాన్ని రీ డిజైన్ చేశారు. దీంతో తుని రైల్వే స్టేషన్ రూపురేఖలే మారిపోయాయని రైల్వే ప్రయాణికులు చెప్తున్నారు. అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్ ఫోటోలను భారతీయ రైల్వే ఎక్స్ వేదికగా పంచుకుంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏపీలోని 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,051 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తుని రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఈ పథకం కింద రూ.19.13 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ నిధులతో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, స్టేషన్ ఎంట్రీ రీ డిజైన్, రైల్వే స్టేషన్ ఆవరణలో పనులు చేపట్టారు. తుని రైల్వే స్టేషన్‌లోని ఒకటీ, రెండు ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు.

# కార్పొరేట్ల లాభాల కోసం.. అమెరికా సామ్రాజ్యవాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో ప్రజాస్వామ్యం, మానవహక్కులు అనే పేర్లతో నడుస్తున్నది వాస్తవానికి కార్పొరేట్ సామ్రాజ్యవాదమే. చమురు, సహజ వనరులు, డాలర్ ఆధిపత్యం కోసం అమెరికా అనేక దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ దాడులు, ఆంక్షలు, రాజకీయ జోక్యాలను సాధనాలుగా మార్చుకుంది. వెనిజులా వంటి దేశాలపై జరుగుతున్న పరిణామాలు ఈ సామ్రాజ్యవాద విధానానికి స్పష్టమైన ఉదాహరణలు.. అణ్వాయుధాల యుగంలో ప్రపంచం మౌనం వహిస్తే, రేపటి మానవ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. చమురు కోసం, సహజ వనరుల కోసం, ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ హోదా కోసం అమెరికా అగ్రరాజ్యం అనేక దేశాలపై దాడులు దండయాత్రలు చేస్తూ తన సామ్రాజ్యవాదాన్ని కార్పొరేట్ల లాభాల కోసం విచ్చలవిడిగా బరితెగించి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. వలస పాలన కన్నా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచ దేశాలను వణికిస్తూ అణ్వాయుధాలతో బెదిరిస్తూ ఉన్నందున ప్రపంచ దేశాలు కొన్ని ఈ సామ్రాజ్యవాదులపై తిరగబడితే ప్రపంచ భవిష్యత్తు ఎటుపోతుందో చెప్పడం కూడా భయమేస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడి అభివృద్ధి చెందిన అమెరికా, ఇప్పుడు ప్రపంచ దేశాలను తన కనుసనల్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. మానవ వనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం, పెట్టుబడులు అన్నీ విదేశాలతో ముడిపడి ఉన్నప్పటికీ, ఆ ఆధారాన్నే సామ్రాజ్యవాదంగా మార్చుకుంటోంది. అమెరికా అభివృద్ధిలో భారతీయుల మేధస్సు, చైనా తయారీ, మెక్సికో వ్యవసాయం, కెనడా ఇంధనం, జర్మనీ యంత్రాలు, జపాన్-దక్షిణ కొరియా సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినా ఈ ఆర్థిక ఆధిపత్యం ద్వారా ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. ట్రంప్ ప్రకటనలను పరిశీలిస్తే వెనిజులా చమురు సంపదపై నియంత్రణే అసలు లక్ష్యమని స్పష్టమవుతుంది. ఇరాన్, సిరియా, నైజీరియా, తాజాగా వెనుజులా అధ్యక్షుడు నికలాస్ మధురో అతని భార్యను కూడా అమెరికా బంధించి నార్కో టెర్రరిజం అని ఆరోపించి న్యూయార్క్ తరలించడం ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలా ఇతర దేశాల్లో జోక్యంతో ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారి అధ్యక్షుడిగా మారి, సామ్రాజ్యవాద విజృంభనకు దారితీస్తున్నాడు. సోషలిజం కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మేలని, స్వేచ్ఛ, ఆర్థిక అభివృద్ధి, ప్రపంచ శాంతి వస్తాయని ప్రచారం చేశారు. కానీ వాస్తవంలో పెట్టుబడిదారులు పాలకులతో చేతులు కలిపి దేశాలను దోచుకుంటున్నారు. ప్రభుత్వాలను కూల్చడం, తమకు అనుకూలమైన వారిని అధికారంలో కూర్చోబెట్టడం ద్వారా వనరులను కైవసం చేసుకుని దేశాల భవిష్యత్తును నియంత్రిస్తున్నారు. పాలకులేమో అన్ని రంగాలను కార్పొరేట్లకు అప్పగించి రాజుల్లా వ్యవహరిస్తున్నారు. ఇలా నిస్సహాయ స్థితిలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నది. నిజానికి పెట్టుబడిదారుడే పాలకుడైనప్పుడు దోపిడీ తప్ప మరో లక్ష్యం ఉండదు. ప్రజలకు అవసరం లేని ఉత్పత్తులు కొనసాగిస్తూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం నిస్సహాయంగా మారి, దాని పేరుతోనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దోపిడీ జరుగుతోంది. ఈ పెట్టుబడిదారులకు పెద్ద దిక్కు అమెరికా. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం తన చట్టాలకు గానీ అంతర్జాతీయ చట్టాలకు గానీ కట్టుబడి ఉండదు. మార్కెట్ విస్తరణ కోసం దిగజారుతున్న తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడం కోసం బలహీన దేశాలపై సైనిక దాడి, రాజ్యాంగం మార్పు పేరుతో ప్రజల రక్షణ కోసం అంటూ రాజకీయ బ్లాక్ మెయిలింగ్ విధానాన్ని అమెరికా అనుసరిస్తున్నది. తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే దేశాలను అమెరికా సహించదు వాటి మీద ఆర్థిక ఆంక్షలు విధిస్తుంది. ఇది ప్రత్యక్ష యుద్ధానికి మరో రూపం. వెనిజులాపై సైనిక దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మధురో అపహరించడానికి కారణం సామ్రాజ్యవాదం ప్రయోజనాలే అని అమెరికా అధ్యక్షుడు తానే వివరించి చెప్పారు. నేటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నిజమైన పోటీ మార్కెట్లు లేవు. ఫైనాన్స్ క్యాపిటల్, స్టాక్ మార్కెట్ల ఆధిపత్యంలో దేశాల ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం క్రమంగా నశిస్తోంది. సాంకేతికంగా, సైనికంగా, ఆర్థికంగా అమెరికా అగ్రరాజ్యంగా మారి కార్పొరేట్ రంగానికి పెద్దదిక్కుగా ఉంది. ఎఐఈ, వరల్డ్ బ్యాంక్, చిూ, జఔ వంటి సంస్థలను తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగిస్తోంది. అణ్వాయుధాల యుగంలో యుద్ధం అంటే మానవజాతి అంతమే. ఈ పరిస్థితిలో ప్రపంచం మౌనం వహిస్తే భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. కాబట్టి నేడు ప్రపంచం అగ్రదేశాల ఆయుధ సంపత్తి కింద నడవకూడదు. వీటి నుంచి బయటపడాలంటే డీ గ్లోబలైజేషన్, డీ డాలరైజేషన్, డీ ప్రైవేటైజేషన్ అయితే తప్ప మన దేశంతో పాటు ప్రపంచ దేశాలు కూడా అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.

# ఏజెన్సీ ప్రాంతాలను హడలెత్తిస్తున్న పులి

**ఏలూరు, జనవరి 28 పెన్ పవర్:**



తెలంగాణలోని కావడిగుడ్ల ప్రాంతం నుండి ఏపీలోకి ప్రవేశించిన ఒక పెద్ద పులి, గత నాలుగు రోజులుగా ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలను వణికిస్తోంది. పందిరిమామిడిగూడెం, ఇనుమూరు, గాడిదబోరు, అంతర్వేదిగూడెం వంటి ప్రాంతాల్లో సంచరిస్తూ ఇప్పటికే కొన్ని పశువులపై దాడి చేసిన ఈ పులి, తాజాగా కన్నాపురం ఫారెస్ట్ పరిధిలోని బిలిమిల్లి గ్రామంలో మరో రెండు పశువులను హతమార్చింది. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి కూడా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పనికి వెళ్లడం లేదని, పులిని త్వరగా పట్టుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు.కొయ్యలగూడెం, బుట్టాయగూడెం పరిసర ప్రాంతాలవారు సాయంత్రం తరువాత ఒంటరిగా తిరగవద్దని, పొలాలకు కూడా వెళ్లవద్దని కన్నాపురం రేంజ్ అధికారి భానుప్రకాశ్, ఎమ్మార్వో నాగరాజు, సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య ప్రజలను హెచ్చరించారు. ఈ క్రమంలోనే దిప్పకాయలపాడు - బిలిమిల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న తోటలో పులి కదలికలు డ్రోన్ కెమెరాకు చిక్కాయి. కెమెరా అలజడికి పులి పరుగులు తీయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.పులి సంచారం దృష్ట్యా అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి ఆచూకీని నిరంతరం పర్యవేక్షించేందుకు 19 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, దానిని బంధించేందుకు రెండు బోనులను కూడా సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో పులి సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రయాణించే అవకాశం ఉందని, అది కరగపాడు, కొవ్వాడ మీదుగా నేషనల్ పార్కులోకి ప్రవేశించవచ్చని డీఎఫ్‌వో పి.వి. సందీప్‌రెడ్డి అంచనా వేశారు. ఈ లోపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మరోవైపు, పులి ఆవాస ప్రాంతాలకు చేరువలో ఉండటంతో అధికారులు ప్రజలను హెచ్చరించారు. సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య, తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో గ్రామాల్లో టాంటాం వేయించి, ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని, పొలాలకు వెళ్లవద్దని సూచించారు. బుట్టాయగూడెం-కన్నాపురం మార్గంలో పులి రహదారి దాటుతుండగా కారు యజమానులు గమనించినట్లు సమాచారం అందడంతో, ఆ పరిసర ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో బిల్లిమిల్లిలో పెద్ద పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దిప్పకాయలపాడు, బిల్లిమిల్లి మధ్యలో రోడ్డు పక్కన తోటలో డ్రోన్ కెమెరాకు చిక్కిన పులి చిక్కింది. అయితే కెమెరా అలజడికి భయపడిన పులి అక్కడినుంచి పరుగులు తీసినట్లు అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల ప్రాంతాలవారు పులి ఎప్పుడు తమపై దాడి చేస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు.

# జగన్ లో ఎంత మార్పో



**విజయవాడ, జనవరి 28చపెన్ పవర్:**
గత ఎన్నికలలో తెచ్చిన ఓటమి వైసీపీ అధినేత జగన్ లో మార్పు తెచ్చినట్లు కనపడుతుంది. వైసీపీ అధికారంలోకి రాకముందు, తర్వాత కూడా జగన్ ను నేరుగా కార్యకర్తలను కలిసే అవకాశముండేది కాదు. ఏదైనా జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు మాత్రమే అదీ వాహనంలో ఉండి పలకరింపులు తప్పించి జగన్ ను ముఖ్య కార్యకర్తలు నేరుగా కలిసే అవకాశముండేది కాదు. ఇక 2019 నుంచి 2024 వరకూ అధికారంలో ఉన్న సమయంలో జగన్ నేతలను, ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా కలిసేవారు కాదు. ఆయన చుట్టూ ఉన్న కోటరీ నేతలను కలవనివ్వకుండా చేసేదని సాక్షాత్తూ విజయసాయిరెడ్డి లాంటి నేతలే బయటకు వచ్చిన తర్వాత ఆరోపణలు చేశారు.అయితే జగన్ ఓటమి తర్వాత కొంత మార్పు వచ్చినట్లు కనపడుతుంది. ఇప్పుడు జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి ఎప్పుడు వచ్చిన నేతలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలకు కూడా ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నారు. వారితో ముచ్చటిస్తున్నారు. కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్నారు. ఓటమి తర్వాత ఇప్పటికే బెంగళూరుకు మకాం మార్చిన జగన్ నెలలో రెండు సార్లు తాడేపల్లికి వస్తారు. ఆయన వస్తారని రాష్ట్రం నలుమూలల నుంచివచ్చిన వారిని నిరాశపర్చకుండా జగన్ వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. వారి వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో క్యాడర్ లో భరోసా నింపే అవకాశముంటుందని ఆయన భావించి కార్యకర్తలకు కలుసుకునే అవకాశం కల్పించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వరసగా కార్యకర్తలపై కేసులు నమోదవుతుండటం, ఇక ఎన్నికలకు మూడేళ్లు మాత్రమే సమయం ఉండటంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతుండటంతో కార్యకర్తలు ఖచ్చితంగా పార్టీ విజయానికి దోహదపడతారని ఆయన గుర్తించినట్లుంది. అందుకే గత కొన్నేళ్లుగా దూరం పెట్టిన కార్యకర్తల భుజం పైన చేతులు వేసి మరీ ఫొటోలు దిగుతున్నారంటే ఖచ్చితంగా జగన్ లో మార్పు వచ్చిందంటున్నారు. ఇక నేతలయితే ఎలాంటి అపాయింట్ మెంట్ లేకపోయినా అప్పటికప్పుడు కలవాలన్నావెళ్లి కలిసే వీలు కల్పించారు. దీంతో క్యాడర్ నుంచి లీడర్ల వరకూ జగన్ లో వచ్చిన మార్పును చూసి ఆశ్చర్యపోతున్నారట. ఇదే పరిస్థితి భవిష్యత్ లోనూ కొనసాగాలని కోరుకుంటున్నారు.

# వరల్డ్ కప్ ముందు క్రేజీ సిరీస్: ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్, స్క్వాడ్, టైమింగ్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ముందు మరో క్రేజీ సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా జట్లు మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ గురువారం (జనవరి 29) జరగనుంది. ఈ మ్యాచ్ కు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఆస్ట్రేలియా జట్టును మిచెల్ మార్ష్ లీడ్ చేయనున్నాడు. మరోవైపు పాకిస్థాన్ జట్టుకు సల్మాన్ అలీ అఘా నడిపించనున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించాలని పాకిస్థాన్ గట్టి పట్టుదలగా ఉంది. మరోవైపు వరల్డ్ కప్ ముందు ఉపఖండపు పరిస్థితులు అర్ధం చేసుకొని వరల్డ్ కప్ కు బరిలోకి దిగాలని కంగారూల జట్టు భావిస్తుంది.

ఓ వైపు ఇండియా, న్యూజిలాండ్ జట్లు విశాఖపట్నం వేదికగా ఈ రోజు నాలుగో టీ20 ఆడుతుంటే మరోవైపు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్లు రేపు లాహోర్ లో తొలి టీ20 ఆడనున్నాయి. ఈ రెండు రోజులు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఖాయంగా కనిపిస్తుంది. ఆస్ట్రేలియా జట్టులో కీలక స్టార్లు జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమ్మిన్స్, గ్లెన్ మాక్స్‌వెల్, టిమ్ డేవిడ్ స్వల్ప గాయాల కారణంగా సిరీస్ కు అందుబాటులో ఉండడం లేదు. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నోలీ, మిచ్ ఓవెన్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తుంది.

**పాక్ జట్టులో బాబర్, అఫ్రిది:**

ఇటీవలే జరిగిన బిగ్ బాష్ లీగ్ లో రాణించకపోయినా పాకిస్థాన్ టీ20 జట్టులో బాబర్ అజామ్ కు చోటు కల్పించారు. బిగ్ బాష్ లీగ్ లో బాబర్ 11 మ్యాచ్‌ల్లో 103.06 స్ట్రైక్ రేట్‌తో కేవలం 202 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ ముందు టోర్నీ కావడంతో బాబర్ అనుభవాన్ని పాక్ క్రికెట్ బోర్డు వినియోగించుకోవాలని చూస్తున్నట్టు అర్ధమవుతోంది. బాబర్ తో పాటు స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది కూడా ఎంపికయ్యాడు. కొంతకాలంగా పాకిస్థాన్ టీ20 జట్టుకు దూరంగా ఉన్న అఫ్రిది జట్టులో చేరాడు. స్టార్ ప్లేయర్స్ మహ్మద్ రిజ్వాన్, హరిస్ రౌఫ్ వంటి సీనియర్ ఆటగాళ్లను పాకిస్థాన్ జట్టు నుండి తొలగించింది.

**ఆస్ట్రేలియాతో తలపడే పాకిస్తాన్ 16 మంది సభ్యుల జట్టు:**

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్,

ఖవాజా మహ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్

**ఆస్ట్రేలియా జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మహ్లి బియర్డ్‌మాన్, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, జాక్ ఎడ్వర్డ్స్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచ్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

**లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ ఎందులో చూడాలంటే..?**

భారత కాలమాన ప్రకారం ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య తొలి టీ20 రాత్రి 8:30 గంటలకు ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వెబ్ బ్రౌజర్‌లలోని సోనీ లివ్ యాప్ లో చూడొచ్చు.

# హై స్కోరింగ్ థ్రిల్లర్‌కు రంగం సిద్ధం.. నాలుగో టీ20కి పిచ్ రిపోర్ట్, వాతావరం ఎలా ఉందంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మరికొన్ని గంటల్లో నాలుగో టీ20 జరగనుంది. బుధవారం (జనవరి 28) ఇరు జట్ల మధ్య విశాఖపట్నం ఈ మ్యాచ్ కు వేదిక కానుంది. ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సూర్యకుమార్ సేన బుధవారం (జనవరి 28) జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కివీస్ నాలుగో టీ20లో ఇండియాకు షాక్ ఇచ్చి ఎలాగైనా బోణీ కొట్టాలని కసరత్తులు చేస్తుంది. ప్రస్తుతం 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా 3-0 ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 బుధవారం (జనవరి 28) సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ ధనాధన్ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 300 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో రన్స్ రాబడుతుండటం విశేషం. 200 ప్లస్ టార్గెట్‌ను 15 ఓవర్లలో.. 150 పైచిలుకు లక్ష్యాన్ని పది ఓవర్లోనే ఛేజ్ చేయడం చూస్తుంటే, కివీస్ బౌలర్లకు ఈ మ్యాచ్‌లోనూ నిద్రలేకుండా చేసేలా కనిపిస్తోంది. నాలుగో టీ20లో ఇండియా రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు నాలుగో టీ 20లో రెస్ట్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. పనిభారం కారణంగా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వైజాగ్ టీ20కు దూరం కానున్నాడు.

**వైజాగ్ వాతావరం రిపోర్ట్స్:**

అక్యూవెదర్ యాప్ ప్రకారం.. బుధవారం (జనవరి 28) ఉదయం ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత కొద్దిగా 27 డిగ్రీలకు పెరిగి సాయంత్రం 21 డిగ్రీలకు పడిపోతుంది. ఎలాంటి వర్ష సూచనలు మ్యాచ్ కు ఉండవు. నైట్ ఎక్కువగా మంచు పడేఅవకాశాలు ఉన్నాయి.

**పిచ్ రిపోర్ట్ ఎలా ఉందంటే..?**

పిచ్ విషయానికి వస్తే వైజాగ్ టీ20కు పరుగుల వరద ఖయాంగా కనిపిస్తుంది. సాధారణంగా ఇక్కడ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ మ్యాచ్ లో హై స్కోరింగ్ అని ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు. మొదటి బ్యాటింగ్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదిగా ఉండి స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్... టాప్ 10లోకి సూర్యకుమార్ యాదవ్, నెంబర్ 1 స్థానంలోనే అభిషేక్

- **న్యూజిలాండ్ సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్, అభిషేక్ శర్మ**
- **929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న అభిషేక్**
- **ర్యాంకింగ్స్‌లో బుమ్రా, హార్దిక్ పాండ్య, శివమ్ దుబేలకు చోటు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్ ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్, ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు.

భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు. అక్షర్ పటేల్ 3 స్థానాలు పడిపోయి 13వ ర్యాంకులో ఉన్నాడు.

**శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు**



# హీరో నేనే విలనూ నేనే.. 'యానిమల్' 3 భాగాలుగా!



రణబీర్ కపూర్ - సందీప్ వంగా కాంబినేషన్‌లో -యానిమల్- సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఒక సీక్వెల్‌తో ముగిసిపోయేది కాదు.. మొత్తం మూడు భాగాలుగా రాబోతోంది. ఆ మేరకు రణబీర్ కపూర్ స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ కథను ఒక ట్రయాలజీగా ప్లాన్ చేశారు. మొదటి భాగం -యానిమల్- కాగా, రెండో భాగం -యానిమల్ పార్క్-. మూడవ భాగానికి సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఇంతలోనే ఇప్పుడు యానిమల్ సీక్వెల్ -యానిమల్ పార్క్- షూటింగ్ 2027 లో ప్రారంభం కానుందని రణబీర్ ధృవీకరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు వేచి చూడక తప్పదని కూడా రణబీర్ అన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం ప్రభాస్ హీరోగా -స్పిరిట్- సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాతే సీక్వెల్ పట్టాలెక్కుతుంది. యానిమల్ రెండో భాగంలో రణబీర్ కపూర్ ద్విపాత్రాభినయం చేస్తారు. మొదటి భాగం చివరలో చూపించిన నెగటివ్ క్యారెక్టర్ (అజీజ్) కి, రణవిజయ్ కి మధ్య జరిగే పోరు చాలా భయంకరంగా ఉండబోతుందని సమాచారం.రెండో భాగంలో విలన్ ఎవరంటే..? మొదటి భాగం చివరిలో అజీజ్ అనే పాత్ర ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రణబీర్ (రణవిజయ్) పోలికలను పొందుతుంది. అంటే రెండో భాగం -యానిమల్ పార్క్-లో రణబీర్ తనతో తనే యుద్ధం చేసుకోబోతున్నారు. ఈ సినిమాలో విలన్ -అజీజ్- పాత్ర రణవిజయ్ కంటే క్రూరంగా ఉంటుందని సమాచారం. --ఇది చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ నేనే పోషిస్తున్నాను-- అని రణబీర్ స్వయంగా వెల్లడించారు.మొదటి భాగంలో తండ్రి (అనిల్ కపూర్) కోసం రణవిజయ్ చేసిన విధ్వంసాన్ని చూశాం. రెండో భాగంలో ఈ బంధం ఇంకా ఏ మలుపులు తిరుగుతుందో, తండ్రిని కాపాడుకోవడానికి ఈ -డబుల్ రోల్- చిక్కుముడులను రణవిజయ్ ఎలా విప్పుతాడో అనేది కథలో కీలకం కానుంది. 2027లో యానిమల్ పార్క్ షూటింగ్ మొదలవుతుంది. అయితే అంతకంటే ముందే రణబీర్ నుండి మరికొన్ని భారీ చిత్రాలు రానున్నాయి. వీటిలో భన్సాలీ -లవ్ అండ్ వార్- జూన్ 2026లో విడుదల కానుంది. అటుపై నితీష్‌తివారీతో -రామాయణం- 2026 దీపావళికి విడుదలవుతుంది.సీక్వెల్ ఆలస్యానికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తే, సినిమా నాణ్యతను పెంచడానికే తప్ప వెనకడుగు వేయడం కాదని రణబీర్ స్పష్టం చేశారు. సందీప్ వంగా ఈ పాత్రల మనస్తత్వాలను ఇంకా లోతుగా విశ్లేషించాలని భావిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో ఉండే ఆ -తీవ్రమైన డ్రామా-ను మళ్ళీ పెద్ద తెరపై చూడాలంటే 2027 వరకు ఓపిక పట్టాల్సిందే!

**కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com